

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## మామను హత్యచేసిన అల్లుడిని అరెస్ట్ చేసిన పోలీసులు




**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** మామను హత్యగావించిన అల్లుడిని గంటల వ్యవధిలో పోలీసులు అరెస్ట్ చేశారని కావలి డిఎస్పీ వెంకట రమణ తెలిపారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కావలి రూరల్ మండలం చెన్నాయపాళెం పంచాయతీ మూలంపేట గ్రామానికి చెందిన మామ నంబూరు నాయుడుబాబును ఆయన అల్లుడు ఇండ్ల శ్రీహరి కర్రతో దాడి చేయడంతో నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలో మృతి చెందాడని డిఎస్పీ తెలిపారు. అప్పటి నుండి ముద్దాయి పరారులో వున్నాడన్నారు. ఈ నెల 6వ తేది మూలంపేటలో ఈ సంఘటన జరిగిందన్నారు. నంబూరు నాయుడుబాబు కుమార్తె వసుంధరను ఇండ్ల శ్రీహరి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్నారు. ఈ మధ్య అల్లుడు ఇండ్ల శ్రీహరి తాగుడుకు బానిసై భార్య వసుంధరను చిత్రహింసలకు గురిచేసేవాడన్నారు. ఈ విషయం అత్తమామలకు తెలియడంతో ముద్దాయిని పలుమార్లు వారించినా ఆయన ప్రవర్తనలో మార్పులేదన్నారు. ఈ నెల 5వ తేది రాత్రి ఇండ్ల శ్రీహరి మద్యం తాగి వచ్చి భార్య వసుంధరతో గొడవ పెట్టుకున్నాడన్నారు. ఈ విషయం తెలుసుకొని ఈ నెల 6వ తేది ముద్దాయి నివాసానికి వెళ్లారన్నారు. ఎందుకురా మా అమ్మాయిని అనవసరంగా కొట్టేది అని అడుగగా అందుకు ముద్దాయి అత్తమామలతో గొడవ పెట్టుకొని పక్కనే వున్న కర్ర తీసుకొని మామను తల వెనుక భాగంలో బలంగా కొట్టాడన్నారు. ఆ దెబ్బకు అతని మామ తల పగిలి రక్తం కారుతూ అక్కడికక్కడే స్పృహ తప్పి కిందపడిపోగా నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. ఈ నెల 6వ తేది రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందాడన్నారు. నంబూరి కోటేశ్వరమ్మ ఫిర్యాదును పురస్కరించుకొని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డిఎస్పీ వెంకట రమణ ఆధ్వర్యంలో కావలి రూరల్ సిఐ యం.రాజేష్, పోలీస్ సిబ్బంది ముద్దాయిని చాకచక్యంగా కాపుకాసి అరెస్ట్ చేశారన్నారు. ఈ ముద్దాయిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన కావలి రూరల్ సిఐ యం.రాజేష్, ఎస్ఐ సుమన్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ యం.రాజేష్‌తో పాటు రూరల్ ఎస్ఐ సుమన్ పాల్గొన్నారు.

## కోటంరెడ్డి అనుచరుడు అరెస్టు



**నెల్లూరు క్రైమ్, ఆగష్టు 8, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ రెబ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచరుడు సమీ హుస్సేన్‌ను మంగళవారం నాడు స్థానిక దర్గా మిట్ట పోలీసు స్టేషన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గత వారంలో జరిగినటువంటి రొట్టెల పండుగ, గంధమహోత్సవంలో జరిగిన చిన్నపాటి గొడవను దృష్టిలో పెట్టుకుని నిజాముద్దీన్ అనే వ్యక్తిని కత్తితో దాడి చేసి చంపబోయినట్లుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమీహుస్సేన్‌ను అరెస్టు చేశామని, తదుపరి విచారణ కొరకు కోర్టుకు హాజరు పరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. అయితే ఈ అరెస్టు కేవలం ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకొని టీడీపీ వర్గీయులను అరెస్టు చేయడం ఏమైనా చర్యని రూరల్ శాసనసభ్యుడు, టీడీపీ వర్గాలు పేర్కొన్నారు. సమీ హుస్సేన్ మొదటి నుంచి వైఎస్సార్‌సీపీలో కీలకమైన నాయకుడుగా ఉంటూ అదే విధంగా ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా కూడా వ్యవహారిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 3గంటల సమయంలో దర్గామిట్ట పోలీసులు సమీ హుస్సేన్ ఇంటి చుట్టూ పోలీసులు మొహరించి అతనిని అరెస్టు చేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం. గతంలో ఒక వ్యక్తిని కత్తితో చంపడానికి ప్రయత్నించినట్లు స్థానిక దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇప్పుడు మరలా అదే విధమైన కేసు నమోదు కావడంతో సమీ హుస్సేన్ అనుచరులు ఇది కేవలం పక్షధోరణితోనే ఇలాంటి కేసులు నమోదు చేస్తున్నారని, ఇందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

## ఆత్మీయ వీడ్కోలు పలికిన ఎస్పీ




**నెల్లూరు క్రైమ్, ఆగష్టు 8, ప్రభాతవార్త** పదవీ విరమణ చేస్తున్న హోంగార్డుకు ఆత్మీయ ఘన వీడ్కోలు పలికి చెక్కులను అందజేసిన జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి. పదవీ విరమణ చేస్తున్న హోంగార్డుకు ఆత్మీయ ఘన వీడ్కోలు, మరణించిన హోంగార్డు కుటుంబ సభ్యులకు చెక్కులను మంగళవారం అందజేశారు. హెచ్‌జీ-243, డి.వేణు గూడూరు-1 టౌన్ నందు విధులు నిర్వహిస్తూ నేడు పదవీ విరమణ చేయడం గర్వకారణమని అన్నారు. 1992న విధులలో చేరి సుమారు 30 సంవత్సరాలు పైగా పోలీసు శాఖలో సేవలను అందించారు. వారి సేవలను కొనియాడి, శాలువాతో సత్కరించి, మెమోంటో అందజేసి ఎస్పీ ఆత్మీయ ఘన వీడ్కోలు పలికారు. సుధీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు.

వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులతో అధిక సమయం గడపాలని, పిల్లలకు తల్లిదండ్రులు దైవసమానులని, వారిని అన్ని విధాలా ఆచరిస్తూ ప్రేమతో చూసుకోవాలని తెలిపారు. అనంతరం వెల్ఫేర్ విభాగం నందు విధులు నిర్వహిస్తూ హెచ్-65 జి.రాజేష్ ఆకస్మికంగా మరణించడంతో మృతుని భార్య శిరీషకు ఒక్క రోజు గౌరవ వేతనం రూ.3,86,950ల చెక్కును అందజేశారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ఎటువంటి సహాయమైన పోలీసు శాఖ తోడుగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. హోంగార్డు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు, ప్రస్తుత పరిస్థితులను తెలుసుకున్నారు. నగదును జాగ్రత్తగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వినియోగించుకోవాలని, పిల్లలను భాగా చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) హిమవతి, ఆర్ఐ పౌల్ రాజ్, పి.సూపరింటెండెంట్ శిరీషలు పాల్గొన్నారు.

## కేంద్ర నిధులను పక్కదారి పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



**చేజర్ల, ఆగస్ట్ 8 ప్రభాతవార్త:** గ్రామస్వరాజ్యమే ధ్యేయంగా గ్రామాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి మళ్లిస్తుందని భారతీయ జనతాపార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌లను కలిసి ఈమేరకు కరపత్రాలను అందజేశారు. 14,15వ ఆర్థికసంఘ నిధులను గ్రామాల అభివృద్ధికి వెచ్చించడానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తే వాటిని పక్కదారి మళ్లించి పంచాయతీల అభివృద్ధిని నిర్వీర్యం చేసి సర్పంచ్‌ల హక్కులను కాలరాసిందన్నారు. రాష్ట్రంలో ఈపంచాయతీల అభివృద్ధికోసం 8,620కోట్ల రూపాయలను వైసిపి ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు. సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 10వ తేదీ ఉదయం నెల్లూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుంకు బాలయ్య, బత్తల కృష్ణయ్య, తెల్లబాటి వెంకటరామానాయుడు, గుండాల విజయభాస్కర్‌రెడ్డి, నాగులవెలటూరు సర్పంచ్ ఎస్.కె.మస్తాన్ , బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమం

**ఉలవపాడు, ఆగస్టు 8, ప్రభాతవార్త** వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉలవపాడు అంబేద్కర్‌నగర్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో 60సంవత్సరాలు దాటిన వృద్ధులకు డాక్టర్ బి.మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 189మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అవసరమని, మరో 11మందికి శస్త్ర చికిత్స అవసరమని డాక్టర్ నిర్ధారించారు. కళ్ళఅద్దాలు ఆరోగ్య కార్యకర్తలు ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పి నగేష్, ఆరోగ్య కార్యకర్తలుసులోచన, అల్తాఫ్, ఆశాకార్యకర్తలు సుజాత, జయమ్మ, తులసి పాల్గొన్నారు. ఈ నెల 16న మన్నేటికోటలోని సచివాలయం వద్ద కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# సహిత విద్యార్థులకు క్రీడాపోటీల నిర్వహణ అభినందనీయం




**నెల్లూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త-విద్య** సహిత విద్యార్థులకు క్రీడాపోటీల నిర్వహణ అభినందనీయమని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో జిల్లాలోని సహిత విద్య విద్యార్థులకు రన్నింగ్, లాంగ్‌జంప్, సాఫ్ట్‌బాల్, షార్ట్‌పుట్, జావెలిన్‌త్రో, బోసి బాల్, వివిధ క్రీడల్లో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిదిగా పాల్గొని జెండా ఊపి క్రీడలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సహిత విద్యార్థుల క్రీడాపోటీల్లో పాలొనటం సంతోషంగా ఉందన్నారు. అలాగే సహిత విద్యా కేంద్రాల్లో చదివే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి మండలంలో సహిత కేంద్రాలను ఏర్పాటుచేసి చిన్నారుల్లో దైర్యాన్ని నింపటం గర్వకారణమన్నారు. సాధారణ విద్యార్థుల్లో మాదిరిగానే దివ్యాంగ చిన్నారుల్లో కూడా అసాధారణ ప్రతిభ ఉటుందని, ఇటువంటి క్రీడాపోటీల నిర్వహణతో అవి వెలుగులోకి వస్తాయన్నారు. జిల్లా లోని దివ్యాంగ చిన్నారులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మరో ముఖ్యఅతిథిగి జిల్లా విద్యాశాఖ అధికారిణి గంగా భవాని మాట్లాడుతు జిల్లాలోని 38 మండల్లాలో భవిత సెంటర్ ద్వారా దివ్యాంగ పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సర్టిఫికేట్స్, ప్రత్యేక టీచింగ్, ఫిజియోథెరఫీ, పెన్షన్, సదరన్ సర్టిఫికేట్స్ వంటి సదుపాయాలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించటంతోపాటూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అక్కడ కూడా రాణించి జిల్లా కు మంచి పేరుతీసుకురావాలని కోరారు. జిల్లా ఐఈ కోఆర్డ్నేటర్ ధనమ్మ మాట్లాడుతు సహిత విద్యార్థులు చదువుతోపాటూ అన్నీ రంగాల్లో రాణించాలనే క్రీడాపోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. పోటీల నిర వ్హహణ విజయవంతం అయ్యేందుకు సహకరించిన అందరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులతోపాటూ, మెడల్స్, ట్రోఫీనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, సమగ్రశిక్ష అదికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పీఎం స్వనిధి పథకంతో చిన్న వ్యాపారస్తులకు జీవనోపాధి




**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 8, ప్రభాతవార్త** నగర వీధులలో వ్యాపారం చేసుకొనే చిరు వర్తకుల కుటుంబాలకు ఆర్థిక, సంక్షేమం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎంస్వనిధి పథకం ఎంతగానో చేయూతను అందిస్తుందని కమీషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మెప్మా విభాగం పీడీ ఆధ్వర్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో లబ్దిదారులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ మాట్లాడుతూ చిరువ్యాపారుల ఆర్థిక ప్రగతి కోసం రూపొందించిన ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని, బకాయి మొత్తాలను సకాలంలో తిరిగి చెల్లించి మరింత మొత్తంలో రుణాలు పొందేందుకు అర్హతలు సాధించాలని సూచించారు. రూ.10వేల రూపాయల నుంచి రూ.50వేల మొత్తం రుణాన్ని మూడు సంవత్సరాల కాలంలో చెల్లించేలా పథకంలో వెసులుబాటు కల్పించారని కమీషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని వీధి వర్తకులు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకులు తమ వ్యాపారాలకు అవసరమైన పెట్టుబడి మొత్తాలను అధిక వడ్డీలకు వడ్డీ వ్యాపారస్తుల వద్ద తీసుకుని, చెల్లింపుల సమయంలో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంపై ప్రజలకు అవగాహన పెంచాలని కమీషనర్ సూచించారు. అనంతరం మెప్మా పీడీ రవీంద్ర మాట్లాడుతూ నెల్లూరు నగర పరిధిలోని రోడ్ మార్జిన్ వ్యాపారస్తులు ఎంత మందికైనా రుణాలు అందజేస్తామని చెప్పారు. ప్రతి వ్యాపారస్తులు తప్పకుండా డిజిటల్ చెల్లింపును అలవాటు చేసుకోవాలని కోరారు. అలాగే తీసుకున్న రుణాలను వాయిదాలు పద్ధతిలో తిరిగి చెల్లించి బ్యాంకు అధికారుల మన్ననలను పొంది, అధిక రుణాల మంజూరుకు అర్హత సాధించాలన్నారు. లబ్దిదారులకు మొత్తాలు మంజూరు చేయడంలో ప్రతిభ కనపరిచిన మెప్మా సిబ్బందిని కమీషనర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం ప్రదీప్‌కుమార్, సీఎంఎం పెంచలయ్య, జరీనా, ఎల్‌హెచ్ సుధాకర్, వివిధ బ్యాంకు మేనేజర్లు, సీఓలు, సీఎల్ఆర్‌పీలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలను తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్‌ఒ



**అనుమసముద్రంపేట, ఆగస్ట్ 8 ప్రభాతవార్త:** ఈనెల 10న జరగనున్న నులిపురుగుల నివారణా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. మంగళవారం ఏఎస్‌పేట, చిరమన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పిహెచ్‌సిల్లో బిపి, షుగర్, పరిక్షలు చేసే సిబ్బంది పలు సూచనలు , సలహాలు చేశారు. రోగులకు సక్రమంగా వైద్యం అందించాలన్నారు. ఈసందర్భంగా పిహెచ్‌సిలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు , ఎంఎల్‌హెచ్‌పిలతో ప్రతే ఏయక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి వారి వారి విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 10వ తేదీన జరిగే నులిపురుగుల నివారణా దినోత్సవకార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 1నుండి 19సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు 5.63లక్షల మంది ఉన్నారన్నారు. వీరందరికీ జిల్లాలోని అన్ని కాలేజీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 10వ తేదీ మధ్యాహ్నం అల్బెండాజోల్ మాత్రలను మింగించడం జరుగుతుందన్నారు. ప్రతి కేంద్రంలో ఆరోగ్యసిబ్బంది అందుబాటులో ఉంటారని , జిల్లాలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం జరుగుతుందని జిల్లాలో వ్యాక్సి వేసుకోని చిన్నారులు 4200మంది ని గుర్తించామన్నారు. వీరందరికీ ఈ వారంలో వ్యాక్సినేషన్ పూర్తి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎపిడిమిక్ అధికారి డాక్టర్ ప్రమోద్, డిసిహెచ్ఎస్‌లు మంజుల, సునీత, ఏఎస్‌పేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ సంధ్యారాణి, సిహెచ్ రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సౌత్‌రాజుపాలెం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 8, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ మంగళవారం సొంతడివిజన్ 12వ వార్డు సౌత్ రాజుపాలెంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని 12/2 సచివాలయం పరిధిలోని సౌత్‌రాజుపాలెం గ్రామంలోని వీధులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు స్థానిక 12వ డివిజన్ సౌత్ రాజుపాలెం గ్రామంను సందర్శించడం జరిగిందన్నారు. డివిజన్ వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణ పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అన్ని వీధులు, రోడ్లు, కూడళ్ళలో చెత్త వ్యఆర్ధలు ఎక్కడా కూడా కనిపించకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మేయర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు డ్రెయిన్ కాలువ కావాలని తమ దృష్టికి తీసుకుని వచ్చారని, వెంటనే అధికారులతో మాట్లాడి అంచనాలను సిద్ధం చేసి త్వరితగతిన డ్రెయిన్ కాలువలను నిర్మిస్తామని మేయర్ తెలిపారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలు కూడా అడగడం జరిగిందని, వాటిని కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మేయర్ పేర్కొన్నారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీధుల్లో వ్యర్థాలు కనిపిస్తే శానిటేషన్ కార్యదర్శులపై చర్యలు



**నెల్లూరుకార్పొరేషన్, ఆగస్టు 8, ప్రభాతవార్త** క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యచరణలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ ప్రణాళిబద్ధంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణకు ప్రజలంతా బాధ్యతగా సహకరించేలా పర్యవేక్షించాలని, వీధుల్లో చెత్త కనిపిస్తే ఆ నిర్లక్ష్యానికి శానిటేషన్ సెక్రటరీలను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 35వ డివిజన్ పొదలకూరు రోడ్డు, సారాయి అంగడి కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమీషనర్ మంగళవారం ఉదయం 6.30గంటలకు పర్యవేక్షించారు. పొదలకూరు రోడ్డు వీధుల్లోని లిఫ్ట్ పాయింట్ల వద్దనుంచి వాహనాల ద్వారా చెత్తను సేకరించడాన్ని గమణించిన కమీషనర్ శానిటేషన్ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా డోర్ టు డోర్ చెత్త సేకరణ మాత్రమే జరిగేలా పర్యవేక్షించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని శానిటేషన్ కార్యదర్శులను హెచ్చరించారు. స్థానికంగా జరిగే ఫంక్షన్స్‌లో వాడి పడేసిన ప్లేట్లు, ప్లాస్టిక్ కవర్లను యధేచ్చగా రోడ్లపై వేస్తున్నారని, అలాంటి కార్యక్రమాలను గుర్తించి ఫంక్షన్ నిర్వాహకులకు ముందుగానే హెచ్చరించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను బహిరంగంగా తగలబెట్టకూడదని ప్రజలకు అవగాహన కల్పించాలని, స్థానిక డివిజన్‌లో మూడు విడతల్లో పారిశుధ్య నిర్వహణ పనులను ప్రతిరోజు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణ కార్మికులు మస్టర్ పాయింట్ల వద్ద ప్రతి రోజు హాజరయ్యేలా పర్యవేక్షించాలని, అనుమతులు లేకుండా గైర్హాజరు అవుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక టీ అంగళ్లు, దుకాణాల నిర్వాహకులతో కమీషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ టీ కప్పులు, ఇతర వ్యర్థాలను రోడ్ల మీద, కాలువల్లో వేయరాదని, ప్రతి దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు విధిగా డస్ట్ బిన్‌లను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. డస్ట్ బిన్‌లను ప్రజలకు కనిపించేలా షాపుల ప్రాంగణాల్లో ఉంచి, అవసరమైన వారు తప్పనిసరిగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. షాపుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే షాపు నిర్వాహకునికి జరిమాన విధిస్తామని కమీషనర్ హెచ్చరించారు. గృహవ్యర్థాలను వాహనాలకు అందించాలని తడి, పొడి చెత్తను విడివిడిగా చెత్త సేకరణ వాహనాలకు అందించాలని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే గృహ వ్యర్థాలను అందించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని, చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చి తిరిగి వినియోగంలోకి తీసుకురాగలమని కమీషనర్ ప్రజలకు వివరించారు. వాహనాలకు కాకుండా బహిరంగ ప్రదేశాల్లో, డ్రైను కాలువల్లో చెత్తను వేయడం వలన దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యాలు కలుగుతాయని కమీషనర్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారివెంకటరమణ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆగస్టు 9న దేశవ్యాప్త మహాపడావును జయప్రదం చేయాలి




**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు ఈ నెల 9వ తేదిన తలపెట్టిన మహాపడావును జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. కావలి ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో మంగళవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కె.నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ జిల్లా గౌరవాధ్యక్షులు మల్లి అంకయ్య, జిల్లా కార్యదర్శి గుంజి కిషోర్, పట్టణ అధ్యక్షులు ఆదినారాయణ, తదితరులు పాల్గొని మాట్లాడారు. 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు కోడ్స్ రూపంలో కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. మున్సిపాల్టీలోని డైలీవేజ్ కార్మికులకు నాలుగు నెలల జీతాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో బుధవారం నుండి సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, డైలీ వేజ్ కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలన్నారు.పర్మినెంట్ కార్మికులకు డిఎ కలపాలన్నారు. పట్టణ పరిధి పెరిగినందు వల్ల కొత్తగా కార్మికులను తీసుకోవాలన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## తుమ్మలపెంట రోడ్డు వెంట వున్న ఆక్రమణలు తొలగించాలి



**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డును ఆనుకొని వున్న వరవ కాలువ, పంట కాలువలను(కొండెపి కాలువ) రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారులు ఆక్రమించారని, దీనిపై ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక బృందం మంగళవారం పరిశీలించిందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్, సిపిఐయంయల్ న్యూడెమోక్రసీ నేత కరవది భాస్కర్, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు, సిపియం నేత పసుపులేటి పెంచలయ్య, సిపిఐ నేత కొప్పర్తి నాగరాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయివిఠల్, నాగార్జున, వెంకీ, హాఫీజ్,ప్రవీణ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కొండెపి కాలువ పంట పొలాలను కలుపుతూ చిప్పలేరు వాగులో కలుస్తుందన్నారు. కావలి పట్టణంలోని రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారస్తులు రోడ్డు వెంట వున్న కాలువలను ఆక్రమించి లేఅవుట్లు వేశారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వేసిన లేఅవుట్లు పరిశీలించిన ఈ బృందం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లుగా భావించిందన్నారు. కావలి పట్టణంలో రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారస్తులు ప్రభుత్వ స్థలాలైన పంట కాలువలు, వరవ కాలువలు, కుంటలు, పోరంబోకు, అసైన్డ్ భూములను ఆక్రమించి లేఅవుట్లు వేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి ముడుపులు తీసుకొని అనుమతులు ఇచ్చారని దుయ్యబట్టారు. పంట పొలాలను విచ్చలవిడిగా కన్వర్షన్ చేయిస్తున్నారన్నారు. అధికారులు భూమిలోకి వచ్చి చూసి కన్వర్షన్ చేస్తున్నారా లేక ఆఫీసుల్లో కూర్చొని కన్వర్షన్ చేస్తున్నారా అనివారు అధికారులను ప్రశ్నించారు.కావలి నియోజకవర్గంలో వున్న పంట పొలాలను, కుంటలను, అసైన్డ్‌భూములను రీసర్వే చేసి కంచె వేయాలని డిమాండ్ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి భాగస్వామ్యంతో, అండతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించిపోయారన్నారు. నుడా అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను కూడా ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్లు వేశారన్నారు. ప్రభుత్వ స్థలాలకు కాపాలదారుడుగా వుండాల్సిన ఎమ్మెల్యే ప్రభుత్వ స్థలాలను భక్షిస్తున్నాడని దుయ్యబట్టారు. కావలికి ఎమ్మెల్యే ఒక శాపంగా అధికారులు మరొక శాపంగా తయారయ్యారన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వేసిన అక్రమ రియల్ ఎస్టేట్ లేఅవుట్లను తొలగించకపోతే భవిష్యత్‌లో ఆందోళన తీవ్రతరం చేయాల్సి వుంటుందని హెచ్చరికలు చేశారు.

## ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్‌కు ఘన నివాళులర్పించిన పలువురు

**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** ప్రజాకవి గద్దర్ మరణం తీరని లోటు అని డాక్టర్ గుండెమడుగుల దేవదానం మెమోరియల్ వైద్యశాల బాధ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు తెలిపారు. మంగళవారం నాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గద్దర్ చిత్రపటానికి నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. గద్దర్ మరణం దేశానికి తీరని లోటు అన్నారు. గద్దర్ సేవానిరతి, సేవాతత్వాన్ని ఈనాటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల బాధలను జానపద పాటలుగా మార్చి ప్రజలను చైతన్యపరిచారన్నారు. ఆయన ఆదర్శాల బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల గౌరవాధ్యక్షులు ఖాదర్‌బాషా, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్, సిపిఐయంయల్ నేత కరవది భాస్కర్, స్వచ్ఛంద సంస్థల నాయకురాలు ఎస్.కె.ఖాదర్‌బీ, హాస్పిటల్ పిఆర్వో ఆనంద్ తదితరులు పాల్గొని ఆయన చేసిన పోరాట పటిమను కొనియాడారు.

## నారాయణలో 15నెలల పాపకు విజయవంతంగా ఓపెన్ హార్ట్ సర్జరీ




**నెల్లూరు ఆగస్టు 8, ప్రభాతవార్త-వైద్యం:** పదిహేను నెలల 5.5 కిలోల తక్కువ బరువుతో ఉన్న పాపకి నారాయణలో అతి క్లిష్టమైన ఓపెన్ హార్ట్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నారాయణ ఆసుపత్రిలో ఏర్పాటు విలేఖరుల సమావేశం నిర్వహించి వైద్యులు వివరాలు వెల్లడించారు. సంగం ప్రాంతానికి చెందిన లక్ష్మీభార్గవి అనే 15ఏళ్ళ పాపకి నెల వయస్సు ఉన్నప్పుడే గుండెలో రంధ్రం ఉన్నట్లు నిర్ధారణ అయిందని, అప్పటి నుంచి ఆ పాపకు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు పదేపదే రావడంతో చెన్నై, తిరుపతి, బెంగుళూరు నగరాలలోని అనేక ఆసుప్రతుల్లో చూపించగా అక్కడివారు శస్త్రచికిత్స చేయడం వీలు కాదని చెప్పడంతో ఆ పాపను వారి తల్లిదండ్రులు నారాయణ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ టిఆర్ ద్వారకానాథ్, డాక్టర్ హారీష్‌లు మాట్లాడుతూ పాపకు ఎకోస్కానింగ్ చేసినప్పుడు గుండెలో కండరం పెరిగి ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో పెద్ద వైంటిక్యులర్ సెప్టల్ లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. పాప తక్కువ బరువుండడంతో ఈ శస్త్రచికిత్స హైరిస్క్‌తో కూడుకున్నదని తెలిపారు. అయితే నారాయణలో ఉన్న అత్యంత అధునాతన పరికరాలు ఉండడంతో ఈ శస్త్రచికిత్సను ఈజీగా చెయ్యగలిగామన్నారు. గుండెకు సంబంధిత ఎలాంటి వ్యాధులనైనా నారాయణలో అతి తక్కువ ఖర్చుతో శస్త్రచికిత్సలను చేస్తున్నామని ఆ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, ఏజిఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న ఇ-క్రాప్ నమోదు



**వింజమూరు, ఆగస్ట్8ప్రభాతవార్త:** వింజమూరు 4వ గ్రామ సచివాలయం ఆర్‌బికె పరిధిలో ఉన్న లెక్కలవారి పాళెంలో వ్యవసాయ పొలాల్లో పంటల ఇ-క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వేగవంతంగా జరుగుతోంది. రైతులు ప్రతి ఏడాది కూడా వ్యవసాయంపై వివిధరకాల పంటలను సాగుచేస్తున్నారు. ప్రధానంగా వేరుశనగ, మొక్కజొన్న, చెరకు ,తమలపాకు పంటలను కాలానుగుణంగా పండిస్తూ జీవనోపాది చేస్తున్నారు. ఈనేపథ్యంలో రైతులు సాగుచేసిన పంటలను విపత్కర పరిస్థితులు నష్టపోయినా రైతు నష్టపోకుండా ఉండేందుకు ఇ-క్రాప్ విధానాన్ని చేపట్టారని విఎఎ మానస తెలిపారు. ఇ-క్రాప్ విధానం ద్వారా పంట నమోదు ప్రక్రియవలన పంట నష్టపోయినప్పుడు ఇన్సూరెన్స్ లభిస్తుందని కావున ప్రతి రైతు పంటను ఇ-క్రాప్ చేయించుకోవాలని మానస తెలిపారు.

## పుంగనూరు ఘటనకు నిరసనగా రాపూరులో వైసిపి శాంతి ర్యాలీ

**రాపూరు, ఆగష్టు08ప్రభాతవార్త:** గత వారం చిత్తూరు జిల్లా పుంగనూరులో పోలీసులపై తెలుగుదేశం పార్టీ నిర్వహించిన దాడికి నిరసనగామంగళవారం రాపూరు ఏయంసీ మాజీ ఛైర్మన్ పాపకన్ను మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నిరసన ర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనుక్షణం ప్రజలకు భద్రత కల్పిస్తూ, పగలు రేయి ప్రజలభద్రతే ధ్యేయంగా పనిచేసే పోలీసులపై మాజీ ముఖ్యమంత్రి సాక్షిగా ఆ పార్టీ శ్రేణులు దాడులకు పాల్పడటం సరికాదన్నారు.వెంటనే ప్రభుత్వం ఈ దాడులపై విచారణ నిర్వహించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోమండల జెసిఎస్ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు,యంపీటీసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల నిధుల దుర్వినియోగంపై కలెక్టరేట్‌ల వద్ద ర్యాలీ



**రాపూరు,ఆగష్టు 8ప్రభాతవార్త:** రాష్ట్రంలో సర్పంచ్‌ల నిధులు దుర్వినియోగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరి పట్ల నిరసన తెలియచేస్తూఈ నెల 10వ తేది అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద బారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ,ధర్నా కార్యక్రమాలునిర్వహించనున్నట్లు వెంకటగిరి నియోజకవర్గ బారతీయ జనతా పార్టీ ఇన్‌చార్జ్ ఎస్.ఎస్.ఆర్ నాయుడు తెలిపారు. మంగళవారం రాపూరులోని తెలుగుగంగ అతిధిగృహం నందు ఆయన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులనుసర్పంచ్‌ల ఖాతలలోకి రానివ్వకుండా దోడ్డిదారిన రాష్ట్ర ప్రభుత్వం అ నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిపారు.ఈ విషయాన్ని పలువురు సర్పంచ్‌లు రాష్ట్ర బిజెపి ఆధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరీ దృష్టికి తీసుకువెల్లడంతో స్పందించిన ఆమె ఈ నెల 10వ తేది అన్ని జిల్లా కలెక్టర్‌ల కార్యలయాల ముందు సర్పంచ్‌ల నిదులను గ్రామాలలో మౌళిక అవసరల నిమిత్తం వారికే కేటాయించాలంటూ ధర్నా,ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలం నుండి పెద్ద ఎత్తున సర్పంచ్‌లు,పార్టీ నాయకులు,కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు. మండల పార్టీ ఆధ్యక్షుడు దూడల పెంచలయ్య, నాయకులు వెంకటరత్నం నాయుడు, గోపాల్,ప్రదీప్ రెడ్డి, మల్లమ్మగుంట గోపి, జోరేపల్లి పెంచలయ్య, వెంకటాద్రీ, మహిళా నాయకురాలు కృపావతి, బుజ్జమ్మ, తదితరులున్నారు.

## సిద్దవరంలో టిడిపి మహిళా శక్తి కార్యక్రమం



**సిద్దవరం(రావూరు), ఆగష్టు 8ప్రభాతవార్త:** మండలంలోని సిద్దవరం గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ మండల పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతియ ఆధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదు ఆదేశాల మేరకు, వెంకటగిరి మాజీ ఏమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ సూచనల మేరకు మహిళా శక్తి కార్యక్రమంలో బాగంగా తెలుగుదేశం పార్టీ ఆధికారంలోకి వచ్చే మహిళలకు ఏమేమి పధకాలు అందించనున్నారో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా ఆధ్యక్షురాలు రమణమ్మ, తిరుపతిపార్లమెంటు ఉపాధ్యక్షుడు కోండ్లపూడి రాఘవ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిది నువ్వులశివరామృష్ణ, రాష్ట ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చిగళ్ల రత్నం,గ్రామ పార్టీ ఆధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలుపాల్గోన్నారు.

## నృసింహుని నిత్య అన్నదానానికి రూ. 50,016 విరాళం

**పెంచలకోన(రావూరు), ఆగష్టు08ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య అన్నదానానికి మంగళవారం స్వామి వారి భక్తులు రూ.50,016 విరాళం ఆందజేశారు. అన్నమయ్య జిల్లా నందలూరు గ్రామానికి చెందిన స్వామి వారి భక్తులు గుండు విజయకుమార్ రెడ్డి, వారి ధర్మపత్ని వసంత గార్లు ఈ విరాళాన్ని స్వామి వారి అన్నదాన నిమిత్తం ఆలయ అర్చక స్వాముల ద్వారా దేవస్థానం సిబ్బందికి ఆందజేశారు. స్వామి వారి అన్నప్రసాదనికివిరాళం ఆందజేసిన భక్తులకు ఆలయ అర్చక స్వాములు స్వామి వారి తీర్ధప్రసాదాలను ఆందజేసి వేదమంత్రాలతో అశీర్వచనాలు ఆందజేశారు.




## ఓటర్ వేరిపకేషన్‌లో టిడిపి ఆధికార ప్రతినిధి

**అకిలివలస(రాపూరు), ఆగష్టు 8ప్రభాతవార్త:** మండలంలోని అకిలివలస బూత్ నెం.54లో జరిగిన బూత్ లెవల్ వెరిపికేషన్ కార్యక్ర మం లో మంగళవారంతిరుపతి పార్లమెంట్ టిడిపి ఆధికార ప్రతినిధి కోండ్లపూడి రా ఘవ రెడ్డి పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రా మంలోఓటరు లిస్టును పరిశీలించి వాటిలో వున్న లోటుపాట్లను బూత్ లెవల్ అధికారికి తెలియపరిచారు. తెలుగుదేశం పార్టీజాతియ ఆధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదు ఆదేశాల మేరకు, వెంకటగిరి మాజీ ఏమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ సూచనలతో ఈ ఓటర్ వెరిపికేషనలో పాల్గోన్నట్లు ఆయన తెలిపారు.

## యాదవ సంఘం తరపున రూ. 20 వేల చేయూత

**రాపూరు,ఆగష్టు 8ప్రభాతవార్త:** మండలంలోని యాదవ సంఘం ద్వారా అనంతపురం జిల్లా నల్లమడ గ్రామానికి చెందిన యాదవ కులానికి చెందిన ప్రవంతికి రూ.20వేల సహాయాన్ని మంగళవారం ఆందజేశారు. ప్రవంతికి తల్లి మరణించడంతో పాటు, తండ్రి అనారోగ్యానికి గురై మంచాన వుండటంతో చదువుకునేందకు ఆర్ధిక స్తోమత లేక చదువుకోనలేక వుండటంతో సామాజికమద్యామాల ద్వారా విషయం తెలుసుకున్న రాపూరు మండల యాదవ సంఘం ప్రతినిదులు మాజీ యంపీపీ ఇసళ్ళసూర్య ప్రకాష్ యాదవ్, కూకాటీ పెంచలయ్య యాదవ్, మందాటి చంద్రమోహన్ యాదవ్‌లు మరికోంత మంది యాదవుల సహకారంతో రూ. 20 వేలు పోగు చేసి ఆ మొత్తాన్ని ప్రవంతి బ్యాంకు అకౌంట్‌లో జమ చేశారు. యాదవ బిడ్డ అభ్యున్నతికి సహకరించిన యాదవ సోదరులకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు.

## నాభూమి-నాదేశం నేడే ప్రారంభం



**వింజమూరు, ఆగస్ట్8ప్రభాతవార్త:** మండలంలో నాభూ మి- నాదేశం కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపిడిఓ రాజేష్ బాబు తెలిపారు. ఈసందర్భంగా మొదటగా శిలా ఫలకం ఆవి ష్కరించి పంచప్రాణ ప్రతిజ్ఞ చేయాలని వసుధకు వందనం, వీరులకు వందనం, హర్-ఘర్, తీరంగ్ కార్యక్రమాన్ని చేపట్టా లన్నారు. 9నుండి14వ తేదీ వరకు మండలంలోని 12పం చాయతీల్లో ఈకార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 10న ఆరవీట కిస్తీపురం, బుక్కాపురం, నందిగుంట, ఊటుకూరు, 11న గుండె మడకల, నల్లగొండ్ల, శంఖవరం, 14న రావిపాడు, కాటేపల్లి, చాకలికొండ, జనార్ధనపురంలో ఈకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది నాభూమి -నాదేశం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



**ఉలవపాడు, ఆగష్టు8,ప్రభాతవార్త** మండలంలోని పెద్దపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ప్రమోషన్‌తో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.మండల విద్యాశాఖ అధికారిగా వెళ్తున్న పి.వెంకటరమణయ్య,టి.నరసింహారావు,ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బాలకృష్ణ,పిఈటి ఉపాధ్యాయుడు ప్రభాకర్‌ను హెడ్మాస్టర్ ఎస్.కె సలాం భాషా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల జయరాం,స్కూల్ మేనేజ్మెంట్ కమిటి చైర్మన్ ఆవుల శ్రీనివాసులు,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్‌లు స్వీకరణ

**సైదాపురం, ఆగష్టు 8, ప్రభాతవార్త** మండల పరిధిలోని తుమ్మలతలుపురు, మలిచేడు, గిద్దలూరు గ్రామం లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్టేజీ-1 అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీ లోపు నామినేషన్ దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఏవో పురుషొత్తం శివకుమార్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

**సైదాపురం, ఆగష్టు 8, ప్రభాతవార్త** దేగపూడి, సైదాపురం రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని వెంకటగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సైదాపురంలోని క్రాస్‌రోడ్డు సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దేగపూడి, సైదాపురం రహదారిపై వెళ్ళాలంటే ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణయ్య పాల్గొన్నారు.

## టిటిడి ఛైర్మెన్‌ను కలిసిన అంకినపల్లి



**వింజమూరు, ఆగస్ట్ 8ప్రభాతవార్త:** టిటిడి ఛైర్మెన్‌గా ఎంపికైన భూమన కరుణాకర్‌రెడ్డిని మాజీ ఎఫ్‌సిఐ ఛైర్మెన్ అంకినపల్లి ఓబులురెడ్డి మంగళవారం తిరుమలలో కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. వింజమూరు మండలంలోని నల్లగొండ్ల లక్ష్మీనర్శింహస్వామి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఓబులురెడ్డి కోరారు.

## భూరక్ష పథకం రీసర్వేను సక్రమంగా నిర్వహించాలి



**వింజమూరు, ఆగస్ట్8ప్రభాతవార్త:** మండలంలో భూరక్ష పథకం రీసర్వేలో భూముల విషయంలో ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా భూ యజమానికి సర్వహక్కులు కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తమిదపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం రీసర్వేను తహసిల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూముల రీఫిక్సింగ్ జరిగే ప్రక్రియను లోటుపాటు లేకుండా చూడాలన్నారు. భూ రీసర్వే వలన ఎక్కువ ప్రయోజనాలు కలుగ నున్నాయన్నారు. ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో భూ యజమానుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ పథకానికి రూపకల్పన చేశారన్నారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది వివాదాలకు తావు లేకుండా పద్ధతి ప్రకారం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వ ఆశయాలను నియమని బంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఆర్ఐ షేక్ శిరాజ్, విఆర్ఓ రమణ య్య, సర్వేయర్ ఖాదర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## 10న జరిగే రెవెన్యూ సదస్సును విజయవంతం చేయాలి

**మర్రిపాడు, ఆగస్ట్8ప్రభాతవార్త:** ఆత్మకూరులోని శ్రీధర్‌గార్డెన్స్‌లో ఈనెల 10న జరిగే రెవెన్యూ సదస్సును విజయవంతం చేయాలని మర్రిపాడు మండల జెసిఎస్ సచివాలయ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిత్యం పరితపించే యువనేత ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గంలోని భూ సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తూఈనెల 10న నిర్వహించనున్న రెవెన్యూ సదస్సును మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మోహన్‌రెడ్డి కోరారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మెప్మా సిబ్బంది




**ఆత్మకూరు, ఆగస్ట్ 8ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలో గతకొద్దినెలలుగా ప్రభుత్వ వైద్యశాలలో కంచి పరమే శ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఆత్మకూరు మెప్మా సిబ్బంది ఈకార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహకారాన్ని అందించారు. ఆత్మకూరు మున్సిపల్‌పరిధిలోని మెప్మా సిఒ మాధవి, 30మంది ఆర్‌పిలతో కలసి మధ్యాహ్నం హాస్పిటల్లోని పేషెం ట్స్‌కు , వారి బంధువులకు అందించే అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. ఈసందర్భంగా ఏర్పా టు చేసిన పలు రకాల వంటలను హాస్పిటల్ లోని పేషెంట్స్‌కు, వారి బంధువులకు వడ్డించే సేవా కార్యరకమాలను నిర్వహించారు. ఎంతో సదుద్దేశంతో కంచి పరమేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఈ ఉచిత అన్నదాన కార్యక్రమంలో తాము పాల్గొని వడ్డించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## వాలంటీర్‌పై ఆరోపణలు అవాస్తవం

**మర్రిపాడు, ఆగస్ట్8ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం నాగినేనిగుంటలో ఒక వాలంటీర్ అవినీతికి పాల్పడ్డాడని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని , పథకం ప్రకారం కొందరు ఈ విధంగా కొన్ని మీడియాల ద్వారా నీలాపనిందలు వేస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఆరోపణల విషయమై మర్రిపాడు ఎంపిడిఓ కూడా విచారణ జరిపితే అవాస్తవాలుగా స్పష్టమైందని పేర్కొన్నారు. మర్రిపాడు మండలం నాగినేనిగుంటకు చెందిన వాలంటీర్ ఖాసింపీరా ఓ మహిళ వద్ద అమ్మఒడి నగదు తస్కరించారంటూ ఆరోపణలు చేయడంతోపాటు ఎమ్మెల్యే, ఆయన కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ఆపాదించేలా కథనాలు ప్రసారం చేశారని వారు పేర్కొన్నారు. అధికారులు విచారణ జరపగా ఆ మహిళ నుండి వచ్చిన సమాధానం , తెలిపిన వివరాల మేరకు వాలంటీర్‌పై ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని వెల్లడైందన్నారు. వాలంటీర్ ఖాసింపీర నాలుగేళ్ళుగా పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ దుష్ప్రచారం కథనాలు ప్రసారం చేసేవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## అంకమ్మతల్లి దేవాలయ పున:నిర్మాణానికి విరాళం



**కందుకూరు, ఆగస్టు8, ప్రభాతవార్త** శ్రీ అంకమ్మతల్లి ఆలయ పున:ని ర్మాణం కొరకు శాసనసభ్యులు మానుగుంట మహీధ ర్‌రెడ ,భక్తులు కలిసి సెప్టెంబర్ 7వ తేదీన అంకమ్మతల్లి విగ్రహ పున: ప్రతిష్ట కార్యక్రమం చేప ట్టా రు.ఈ కార్యక్రమానికి సహ కరించిన భక్తులందరికీ ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పున:నిర్మాణం,బంగారు యంత్రం కొరకు మంగళవారం దాతలు విరాళం అందిచా రు. గోళ్ల సత్యనా రాయణ ధర్మపత్ని సింగమ్మ కలిసి రూ. 25,116లు కానుకగా అందించారు.అమ్మవారి బంగారు యంత్రం కొరకు వేమూరి కిరణ్ ధర్మపత్ని వాణి కుమారుడు రోహిత్ కలిసి 1గ్రాము బంగారు విలువచేసే నగదు ,రూ.6251/-కమిటి సుభ్యులకు అందించారు.ఈ కార్యక్రమంలో యెనిమిరెడ్డి వెంకటరెడ్డి,మాదాల మా ద్యాద్రి,కొడాలి కోటేశ్వరరావు,మంచిరాజు మురళీమోహన్,కొండూరి వసంతరావు తదితరులు పాల్గొన్నా రు.సెప్టెంబర్ 4,5,6,7 తేదీల్లో జరగబోవు అమ్మవారి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

## విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి



**కందుకూరు, ఆగష్టు 8, ప్రభాతవార్త** టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిఏ స్పెషల్ ఇంగ్లీష్ విద్యార్థిని,ఇట్లా సిం ధుజ,ఎన్‌సిఇఆర్‌టి నిర్వహించిన అఖిల భారత ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఇంగ్లీష్ విభాగంలో ఆల్ ఇండియా 168వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు ,రిజర్వేషన్ కేటగిరిలో మొదటి ర్యాంకు ను, రిజర్వేషన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకు సాధించడం జరిగింది.ఒక సామాన్య గ్రామీణ ప్రాంత కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థిని అఖిలభారత స్థాయిలో ఆంగ్ల విభాగంలో ఈ విధంగా రాణించడం ఎంతో గర్వించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.టిఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఉన్న అధ్యాపకులు భోధనానుభవా న్ని,సౌక ర్యాలను,కందుకూరుపరిసర ప్రాంతాల విద్యార్థినీ విద్యార్థులు వినియోగించుకోవాలని ఈ కళాశాలలో చేరి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా కోరారు.

## ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పివి.రమణయ్య

**ఉలవపాడు, ఆగష్టు8, ప్రభాతవార్త** ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఉలవపాడు మండలంలోని ఆత్మకూరు పంచాయతీలో ఖాళీగా ఉన్న 5వ వార్డు నెంబర్(ఎస్సీ జనరల్) ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్.చెంచమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 8వ తేదీ నుండి నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మండల విద్యాశాఖ అధికారి పివి.రమణయ్యను నియమించినట్లుగా ఆమె తెలిపారు.

## ప్రజాసమస్యలు పరిష్కారం బీజేపీతోనే సాధ్యం



**సైదాపురం, ఆగష్టు 8, ప్రభాతవార్త** రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యమని వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని సైదాపురంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, గ్రామంలో అభివృద్ధి శూన్యమని అన్నారు. సైదాపురం మండలంలో ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని తెలిపారు. ఈనెల 10వ తేదీన తిరుపతిలోని కలెక్టరేట్ కార్యాలయం నందు గ్రామ సర్పంచ్‌లు చేస్తున్న ర్యాలీలో పార్టీ కార్యకర్తలు, నాయకులు జనసమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు చాంద్‌కాశీం, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బరాజు, నాయకులు వెంటరత్నయ్య, కృష్ణ, వెంకటరత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు మృతి



**బిట్రగుంట, ఆగస్టు 8 ప్రభాతవార్త** బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప జాతీయ రహదారి వంతెనపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విషమ పరిస్థితులలో వున్న మరో ఇద్దరు కూడా మంగళవారం చికిత్స పొందుతూ నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందినట్లు బిట్రగుంట పోలీసులు తెలిపారు. పశ్చిమబెంగాల్ నుండి బెంగుళూరు అర్బన్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు ఏడు మంది కూలీలు కారులో వెళ్తుండగా కప్పరాళ్ళతిప్ప జాతీయ రహదారి వంతెన చేరుకునే సరికి టైర్ పంక్చరైంది. కారులోని నలుగురు వ్యక్తులు కారు దగ్గర వుండటం, మరో ముగ్గురు వ్యక్తులు దూరంగా వుండటంతో కావలి నుండి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ వెనుక నుండి ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కావలి ఏరియా వైద్యశాల నుండి ఆదివారం రాత్రి మెరుగైన వైద్యం కోసం తరలించగా సోమవారం ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు జూలుమందల్ (35), నబాకుమార్ బిశ్వాస్ (25)ల పరిస్థితి విషమించడంతో నెల్లూరు ఆసుపత్రికి సోమవారం రాత్రి తరలించగా మంగళవారం మృతి చెందారని పోలీసులు తెలిపారు. పొట్టకూటి కోసం బెంగుళూరు ఫ్యాక్టరీకి వస్తూ తమ సహచార కూలీలు నలుగురు మృతి చెందడంతో బెంగుళూరు నుండి సహచార కూలీలు నెల్లూరు ఆసుపత్రి వద్దకు వచ్చి బంధులతో సహా బోరున విలపిస్తున్నారు.

బోగోలుకు అచ్చిరాని ఆదివారం...బోగోలు మండలానికి ఈ నెల 6వ తేది ఆదివారం అచ్చిరాని ఆదివారంగా వరుస సంఘటనలతో అపశృతులు చోటుచేసుకున్నాయి. అదే రోజు కొండబిట్రగుంటలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దారుణహత్యకు గురికావడం, తిప్ప వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురు వ్యక్తులు మృతి చెందడంతో ఈ ఆదివారం కలిసి రాలేదని చర్చించుకుంటున్నారు.

## స్వాతంత్ర దినోత్సవ పేరెడ్‌కు ఎంపికైన విశ్వనాధరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు



**బిట్రగుంట, ఆగస్టు 8 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్న త పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవం జిల్లా పేరెడ్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్‌ఠాగూర్ తెలిపారు. అందులో భాగంగా మంగళవారం పేరెడ్ విన్యాసంలో పాల్గొనే విద్యార్థుల చేత జాతీయ పతాకం ఎగురవేసే సన్నివేశాన్ని వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహరావు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చాడు. కాగా జిల్లా పోలీస్ పేరెడ్ గ్రౌండ్‌లో తమ పాఠశాల విద్యార్థులకు అవకాశం కల్పించినందుకు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్‌ఠాగూర్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాటంరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డిని పరామర్శించిన డాక్టర్ ప్రభాకర్‌నాయుడు



**కావలి రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త** మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి ఇటీవల కాలికి గాయమై శస్త్ర చేయించుకొని అల్లూరులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకొని కావలి మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్, విష్ణువర్దన్‌రెడ్డి శ్రేయోభిలాషులు అనంతరాజు కృష్ణంరాజు, గోసల గోపాల్‌రెడ్డి, పాలవల్లి పద్మనాభరెడ్డి, కె.గోపీకృష్ణ, ఎ.కళ్యాణ్‌చక్రవర్తి, గుర్రం మల్లికార్జునచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి జెండాదిబ్బ వాసుల వినతి



**సంగం ఆగష్టు 8 ప్రభాతవార్త** సంగం మండలం జెండాదిబ్బ గ్రామంలో ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర ్భంగా జెండాదిబ్బ గ్రా మప్రజలు ఇండ్ల స్థలాలు కావాలని,డ్రైన్స్ కావాలని, రోడ్లు కావాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జెండాదిబ్బ గ్రామ సమస్యలన్ని పూర్తి స్థాయిలో తెలుసుకోవడం జరిగిందని అన్నారు.అన్ని సమస్యలు పరిష్కరించే విధంగా ముందుకు వెళతామని చెప్పారు.ప్రతి సమస్య పరిష్కరించే విధంగా ముందుకు వెళుతున్నామని అన్నారు.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపథకాలు ద్వారా ప్రజలను అన్ని విధాల ఆదుకుంటున్నారని అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేస్తారని తెలిపారు. ఇటీవల జగనన్న సురక్ష కార్య క్రమం ద్వారా కోటి సర్టిఫికేట్లు ఇవ్వడం జరిగిందని చెప్పారు. జెండాదిబ్బ గ్రామాన్ని దివంగతనేత మేకపాటి గౌతంరెడ్డి దత్తత తీసుకున్నారని అభివృద్ధి దిశగా అడుగులు పడలేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా వెంటనే స్పందించిన ఆయన జెండాదిబ్బ కు పెద్దఎత్తున నిధులు మంజూరు అయి కరోనా వల్ల వెనుకకు వెళ్ళిపోయాయని చెప్పారు.దండుబాట కావాలని ,నాయిబ్రాహ్మణ కాలనీకి డ్రైన్‌లు కావాలని ప్రజలు కోరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని గ్రామాలన్ని అభివృద్ధి చెందాలని ఆయా గ్రామాలలో ఉండి ఇతర దేశాలలో ఉన్న వారితో గ్రామాభివృద్ధికి సహకరించమని కోరగా అందుకు అనేక మంది స్పందించారని ఆ కార్యక్రమం విజయవంతం అయ్యే దిశగా చూస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమపథకాలకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని 175 సీట్లకు 175 సీట్లు రావడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో వైసిపి మండలపార్టీ అధ్యక్షులు పులగం శంకర్‌రెడ్డి, వైసిపి నాయకులు కంఠాబతి నరఘునాదరెడ్డి,జడ్‌పిటిసి రావుల లక్ష్మీ, తహసిల్దారు వై.నాగరాజు, ఎంపిడిఒ గోపి , ఆనంప్ర సాద్‌రెడ్డి, పగడాల రఘురామయ్య,మానికల చందు,చంద్రారెడ్డి,మదన్‌మోహన్‌రెడ్డి,విఒపిఆర్‌డి రమేష్ ,కార్యదర్శి నాయబ్, వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలను మోసం చేస్తున్న జగన్



**నెల్లూరు ఆగస్టు 8, ప్రభాతవార్త-వైద్యం** జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మాయ మాటలతో మహిళలను మోసం చేస్తున్నాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 14, 15 డివిజన్లలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ గోడకి స్టిక్కర్లను అంటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాడని విమర్శించాడు. ప్రతి బిడ్డకు అమ్మఒడి ఇస్తానని చెప్పిన జగన్ నేడు కోతలు విధిస్తూ ఒక్కబిడ్డకి మాత్రమే ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. అందుకే చంద్రబాబు అధికారంలోకి వస్తే మరింత సంక్షేమాన్ని మహిళలకు అందించడం కోసం మహాశక్తి కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని వెల్లడించారు. మహిళలకు కోసం ఆడబిడ్డ నిధి, దీపం, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఇవే కాకుండా చంద్రబాబు అధికారంలోకి వస్తే మహిళల కోసం అనేక చట్టాలను ప్రవేశపెడతారనే నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ళ విజేతరెడ్డి, తాళ్ళపాక అనూరాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్, పి అజయ్‌రెడ్డి, కమ్మ కళ్యాణి, పసుపులేటి మల్లిఖార్జున, కేపీ చౌదరి, ఆకుల హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో యానాదులకు స్థానం కల్పించాలి



**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** చట్టసభల్లో యానాదులకు స్థానం కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషనైనా ఏర్పాటు చేయాలని యానాదుల పొలిటికల్ ఫోరం కన్వీనర్ కె.సి.పెంచలయ్య డిమాండ్ చేశారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ' కదలారా యానాది...తరలిరా గుంటూరు' అనే నినాదంతో సెప్టెంబరు 9వ తేదిన చలో గుంటూరు లక్ష మంది యానాదులతో యానాదుల రాజకీయ భేరి మోగిస్తున్నట్లు తెలిపారు. యానాదులకు ఎమ్మెల్సీ కానీ ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యానాదుల పొలికల్ ఫోరం ఆధ్వర్యంలో సెప్టెంబరు 9వ తేది గుంటూరులోని కాసు బ్రహ్మనందరెడ్డి స్టేడియంలో రాజకీయ భేరి నిర్వహి స్తున్నామన్నారు. రాష్ట్రంలో పది లక్షల జనాభా కలిగిన యానాదులకు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. యానాదులను గుర్తించిన వారికే యానాదులు ఓట్లు వేస్తారన్నారు. గుంటూరు సభలో రాజకీయ నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు.యానాదులను రాజకీయ పార్టీలు ఓట్ బ్యాంక్‌గా వాడుకొని మోసం చేస్తున్నాయన్నారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్, ఎమ్మెల్సీ ఇస్తామని జగన్ చెప్పిన హామీ నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. ఈసారి యానాదులకు ఎమ్మెల్సీ, ప్రత్యేక కార్పొరేషన్ ఇస్తామని ఏ పార్టీ అయితే మేనిఫెస్టో పెడుతుందో వారికే యానాదులు మద్దతు ఇస్తామని తెలిపారు. అలాగే ఈ జిల్లాలో యానాదులు ఎక్కువ సంఖ్యలో వున్నారన్నారు. కోవూరు నియోజకవర్గ అసెంబ్లీ స్థానాన్ని యానాదులకు కేటాయించాలన్నారు. మా ప్రతిపాదనలను ఏ పార్టీ స్వీకరిస్తుందో వారికే ఓట్లు వేస్తామని లేని యెడల మా కాలనీలలో ఓట్లు అడిగేందుకు రావాల్సిన అవసరం లేదన్నారు.

గుంటూరులో తలపెట్టిన యా నాదుల రాజకీయ భేరికి యా నాదులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమా వేశంలో సతీష్‌చంద్ర, రాపూరు కృష్ణయ్య, చెంబేటి ఉష, రాపూరు రాధమ్మ, చలంచర్ల కలుగోళమ్మ,మాణికల మురళి, అద్దూరు శీనయ్య, చలంచర్ల వెంకట శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సోమిరెడ్డిపై వైసీపీ నేతలు మండిపాటు



**నెల్లూరు సిటీ, ఆగష్టు 8, ప్రభాతవార్త** మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై వైసీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. నెల్లూరు వైసీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తమ నేత మంత్రి కాకానిపై విమర్శలు చేసే అర్హత లేదని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కనుపూరు చెరువులో మట్టి అక్రమ తవ్వకాల సూత్రదారి సోమిరెడ్డి అనుచరుడు బుజ్జి నాయుడు అని మీడియా ముందు ఆధారాలతో ప్రదర్శించారు. సోమిరెడ్డి అనుచరుల ధనదాహానికి నిండుప్రాణం బలైందని ఆరోపించారు. బుజ్జి నాయుడు టిప్పర్ ఢీకొని బ్యాంక్ ఉద్యోగి మృతి చెందారని, ఏడుగురు గాయపడ్డారని గుర్తు చేశారు. ప్రమాదానికి కారణమైన వారిని పక్కాప్లాన్‌తో స్టేషన్ నుంచి తప్పించారని మండిపడ్డారు. నియోజకవర్గంలో అన్ని సార్లు సోమిరెడ్డి ఓటమికి ఆయన అవినీతే కారణమన్నారు. సర్వేపల్లిలో గ్రావెల్ మాఫీయాపై విచారణ చేయమని కలెక్టర్‌ను కోరిన సోమిరెడ్డికి.. టిప్పర్ ఢీకొని బ్యాంకు ఉద్యోగి చనిపోయిన ఘటనపై విచారణ కోరే దమ్ముందా అని ప్రశ్నించారు. మట్టి దొంగలకు, దోపిడి దారులకు సోమిరెడ్డి ఆశ్రమం కల్పిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్ణికుల క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ నెల్లూరు శివప్రసాద్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు తలమంచి సురేంద్రబాబు, తోటపల్లిగూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 8,ప్రభా త వార్త** భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొని అమరులైన వారి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలని నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ తెలిపారు. స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు ఆవాజ్ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో గ్యాలరీని మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన వారి జీవిత చరిత్రలను భావితరాలకు తెలియజేయడానికి ఆవాజ్ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ సహకారంతో 350 కలర్ ఫోటోలు వారి జీవిత చరిత్రలతో కూడిన ఫోటో గ్యాలరీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఫోటో గ్యాలరీని సందర్శించి అమరులైన స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను, వారి త్యాగాలను తెలుసుకోవాలని మేయర్ కోరారు. ప్రజలను చైతన్యవంతులుగా చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని నిర్వాహకులను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రఫీ, రషీద్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా గెలిపించండి



**నెల్లూరు ఆగష్టు 8, ప్రభాతవార్త-వైద్యం** నన్ను నెల్లూరు రూరల్ నియోజకవర్గ శాసనసభ్యుడిగా మరోసారి గెలిపించి, మీకు మరోసారి సేవ చేసుకునే సదావకాశాన్ని కల్పించమని నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. మంగళవారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని గొల్లకందుకూరు గ్రామంలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమంలో కోటంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అభ్యున్నతి, సంక్షేమాలు కొనసాగాలంటే అది ఒక్క చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. నేను కష్టాల్లో ఉన్నవేళ నాకు అండగా నిలబడి ఇంత పెద్దఎత్తున నన్ను ఆశీర్వదించడానికి వచ్చిన మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ళపాక అనూరాధ, మమతారెడ్డి, తోట శోభారాణి, చేజర్ల కవిత, జలదంకి సుధాకర్, మంగళపూడి దయాకర్‌రెడ్డి, మంగళపూడి భాస్కర్‌రెడ్డి, వినుకోటి వేమయ్య, రంగయ్య, తోడేటి మురళి, గోగుల ఆంజనేయులు, బైనపోయిన పెంచలయ్య, మస్తానయ్య, గుంజి కిరణ్, బెల్లంకొండ అజయ్, దయాకర్, దద్దోలు అంకయ్య, చింతగింజల శ్రీనయ్య, తాటిపర్తి శీనయ్య, జి మధు, సందీప్‌రెడ్డి, జి వెంకటేశ్వర్లు, ఏ సురేష్, హరిబాబు, టి రమేష్, కె లచ్చరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న లారీ-నలుగురికి గాయాలు



**బుచ్చి ఆగష్టు 8 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని ముంబాయి జాతీయ రహదారిలో కెఎం హాస్పటల్ సమీపంలో నెల్లూరు వైపు నుండి వస్తున్న లారీ ఆటోను ఢీకొనగా అందులో ప్రయాణిసు ్తన్న ప్రయాణికులకు తీవ్రగాయాలు అయ్యాయి. అలాగే అరుణమ్మ అనే మహిళపై లారీ వెళ్లడంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా ఆమెను నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. పారిపోతున్న లారీ డ్రైవర్‌ను పోలీసులు చేజ్ చేసి పట్టుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. బుచ్చి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తరక్రియలు



మా ఇంటి ఆశా జ్యోతి
స్వర్గీయ శ్రీమతి మన్నవ విజయకుమారి గారు
తేది 25.07.2023 మంగళవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
భర్త: మన్నవ రవిచంద్ర
టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు.
సెల్: 9640148235
కుమారులు - కోడళ్ళు
మన్నవ తేజ్ బాబు - చాముండేశ్వరీ దేవి
మన్నవ శ్రీరామ్ చౌదరి - నిషిత
మన్నవ యశ్వంత్
కుమార్తె: డా॥ యం.సాయి మహిత
స్వర్గీయ శ్రీమతి మన్నవ విజయకుమారి గారు
మరణం 25.07.2023
జనతాపేట సౌత్, 1వ వీధి, కావలి.
మనుమరాళ్ళు: మన్నవ శ్రీనిత్య, అశ్రిత మనుమడు: అద్వత్ చౌదరి
పెద్దకర్మ : తేది 10.08.2023 గురువారం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి, జనతాపేట సౌత్, 1వ వీధిలో (నవాబ్ బిల్డింగ్) వద్ద గల మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

## ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, ఆగష్టు 8,ప్రభాతవార్త** ప్రకృతి ఒడిలో ప్రశాంత జీవ నం సాగించే ఆదివాసీలు స్వచ్ఛమైన మనసుకు, మానవ సంబం ధా లకు ప్రతిరూపాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అ న్నారు. ఆగష్టు 9వ తేదీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ సాంస్కృతిక ప్రపంచంలో ఆదివాసీలకు ప్రత్యేక స్థానం ఉంటుందని కొనియాడారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి, వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట చర్యలు చేపట్టారన్నారు. గిరిజన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చి రాష్ట్ర రాజకీయాల్లో భాగస్వాములను చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. గిరిజనుల ఆరోగ్యం, విద్య, నీటి సరఫరా, విద్యుత్ రవాణా సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.

## నికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్‌పై ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు సిటీ, ఆగష్టు 8, ప్రభాతవార్త** దేశ వ్యాప్తంగా ప్రాంతాల వారీగా అమలవుతున్న నికిల్ సెల్ ఎనీమియా స్క్రినింగ్‌పై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంబంధిత శాఖ మంత్రిని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్దేశిత లక్ష్యం తదితర అంశాలపై వివరాలు కోరారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ మంత్రి ప్రకాష్ సింగ్ సమాధానమిస్తూ దేశంలో నికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్‌ను మధ్యప్రదేశ్‌లో2022 జూలై1న ప్రారంభించారని తెలిపారు. ఈ మిషన్ కింద వ్యాధిగ్రస్తులందరికి సరైన వైద్యం అందించడం, వ్యాధిగ్రస్తుల సంరక్షణ, వ్యాధి తీవ్రతను తగ్గించడం, వ్యాధిపై అవగాహన కల్పించడం వంటివి నిర్వహిస్తారన్నారు. 278 జిల్లాలోని వ్యాధిప్రభావిత గిరిజన ప్రాంతాల్లో ఉన్న 0-40 సంవత్సరాల మధ్య వయస్సు గల 7 కోట్ల మంది ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కౌన్సెలింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అవగాహన, కౌన్సెలింగ్ మెటీరియల్‌ను అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ అమలులో ముఖ్య పాత్ర పోషించాలని, గ్రామాలు, పాఠశాలలు, హాస్టళ్లలో కౌన్సెలింగ్ ఏర్పాట్ల ద్వారా స్క్రీనింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో 6,68,833 స్కీనింగ్ టెస్టులు టార్గెట్ కేటాయించామన్నారు.

## క్రెడిట్ కార్డు డిఫాల్టర్ల అంశంపై ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు సిటీ, ఆగష్టు 8, ప్రభాతవార్త** దేశంలో క్రెడిట్ కార్డు డిఫాల్టర్ల అంశంపై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సబంధిత శాఖా మంత్రిని ప్రశ్నించారు. క్రెడిట్ కార్డు డిఫాల్టర్లు శాతం, క్రెడిట్ కార్డు చెల్లింపుల ఎన్‌పీఏల వివరాలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. క్రెడిట్ కార్డు బకాయిలు, సంబంధిత శాఖ తీసుకున్న చర్యలపై సమాధానం కోరారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయమంత్రి డాక్టర్ భగవత్ కరద్ సమాధానమిస్తూ ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం క్రెడిట్ కార్డులతో డిఫాల్టర్లకు సంబంధించి, స్థూల నిరర్ధక ఆస్తులు(జీఎన్‌పీఏ) మార్చి-2022 లో రూ.3,122 కోట్లు మార్చి-20233 లో రూ.4.072 కోట్లుగా ఉన్నాయన్నారు. మార్చి -2022 నాటికి క్రెడిట్ కార్డు బకాయిలు రూ.1.64 లక్షల కోట్లు కాగా, మార్చి-2023 కు 2.10లక్షల కోట్లు అయినట్లు తెలిపారు. మార్చి 2023లో షెడ్యూల్ వాణిజ్య బ్యాంకుల జీఎన్‌పీఏ 3.87 శాతంలో పోలిసస్తే క్రెడిట్ కార్డులలో జీఎన్‌పీఏ మార్చి-2021 లో 3.56 శాతం నుంచి మార్చి-2022 నాటికి 1.91శాతం తగ్గాయన్నారు. మార్చి-2023లో 1.94శాతం ఉందన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి



**నెల్లూరు సిటీ, ఆగష్టు 8, ప్రభాతవార్త** నెల్లూరు నగరం విజయ్ మహల్ గేట్ నుంచి రామలింగాపురం అండర్ బ్రిడ్జి వరకు వాహన పార్కింగ్‌పై అధికారులతో చర్చిస్తున్నామని ట్రాఫిక్ నియంత్రణపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ పొగతోట, తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం 147వ రోజు కార్యక్రమాన్ని స్థానిక నేతలు, సంబంధిత అధికారులతో కలిసి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. పథకాలు అందని వారి సమస్యను పరిశీలించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొగతోట, బృందావనం ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న డ్రెయిన్ల పనులు అన్నింటిని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ ప్రాంతానికి సంబంధించి స్థానికులు, వైద్యులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ముదిరెడ్డి వేదవంతి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల జీవితాలతో ఆడుకోవద్దు..!



నెల్లూరు క్రైమ్, ఆగష్టు 8, ప్రభాతవార్త పోలీసు అధికారులు ఎంత చెప్తున్నా కూడా కొంతమంది తమ స్వార్థం కోసం భావితరానికిపునాది అయినటువంటి పిల్లల జీవితాలను చిదిమేస్తున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో నగరంలోని కార్పొరేట్ విద్యాలయాలకు తమ పిల్లలను చేరవేసేందుకు తల్లిదండ్రులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని ఆటోలను నడుపుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన నివారణ చర్యలు మాత్రం గాలికి వదిలేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అధికారులు మాత్రం శ్రమిస్తే సరిపోతు ఇటు తల్లిదండ్రులలో కూడా మార్పు రావాల్సి ఉంది. లెక్కకు మించి విద్యార్థులను తరలించే ఆటోలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.